క్లుప్తంగా

ఘనంగా వార పండగ



రౌతులపూడి వార పండగ జరుపుకుంటున్న గ్రామస్తులు

రౌతులపూడి: వర్షాలు కురవాలని కోరుతూ గురువారం పలు గ్రామాల్లో ప్రజలు వార పండగ నిర్వహించారు. మండలంలోని రౌతులపూడి, బలరామపురం గ్రామాల్లో రైతులు, మహిళలు, యువకులు గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు విస్తారంగా కురిసి పంటలు బాగా పండేలా చూడాలని గ్రామదేవతలను వేడుకున్నారు. కలశాలతో నీటిని తీసుకొచ్చి అమ్మవార్లకు జలాభిషేకాలు చేశారు. అనంతరం గ్రామాల్లో జాతర నిర్వహించారు. రోడ్లపై నీరు వేసి జలమయం చేశారు. మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ వాసిరెడ్డి భాస్కరబాబు, పైల సాంబశివరావు, ఇటంశెట్టి సూర్యభాస్కరరావు, దాసరి తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షం



ప్రత్తిపాడు అల్లూరి సీతారామరాజు జంక్షన్‌లో నిలిచిన నీరు

ప్రత్తిపాడు: మండల వ్యాప్తంగా గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకూ ఎండ వేడిమి, ఉక్కపోతతో అల్లాడిన ప్రజలు సాయంత్రం కురిసిన వర్షంతో ఉపశమనం పొందారు. పలు గ్రామాల్లో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఖరీఫ్ వరి సాగుకు ఈ వర్షం ఉపయోగపడుతుందని రైతులు తెలిపారు.

తొండంగి : మండల వ్యాప్తంగా గురువారం ఓ మోస్తరు వర్షం కురిసింది. కొద్ది రోజులుగా వర్షాలు కురవకపోవడంతో మెట్ట ప్రాంతాల్లో వరినాట్లు వేసిన రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ వర్షానికి ఎండుతున్న పంటలు ఊపిరి పోసుకుంటాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రత్తిపాడు సీఐగా శేఖర్‌బాబు



ప్రత్తిపాడు: ప్రత్తిపాడు పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఎం.శేఖర్‌బాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ సీఐగా పని చేసిన కె.కిషోర్‌బాబు కాకినాడ జిల్లా పోలీస్ ట్రెనింగ్ సెంటర్‌కు బదిలీ అయ్యారు. కోనసీమ జిల్లా రాజోలులో సీఐగా పని చేస్తున్న శేఖర్‌బాబు ఇక్కడకు బదిలీపై వచ్చారు. సీఐ శేఖర్‌బాబుకు ప్రత్తిపాడు ఎస్సై ఎం.పవన్‌కుమార్, సిబ్బంది స్వాగతం పలికారు.

పంట పొలాల పరిశీలన

ఏలేశ్వరం: మండలంలోని పలు గ్రామాల్లో పంట పొలాలను గురువారం వ్యవసాయశాఖ అధికారులు పరిశీలించారు. ఏఓ జ్యోతి ఆధ్వర్యంలో జిల్లా ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త నరసింహరావు, పెద్దాపురం పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త సుజాత తదితరులు తిరుమాలి, యర్రవరం, లింగంపర్తి, సి.రాయవరం గ్రామాల్లోని పర్యటించి వరి, చెరకు, రాగి, అరటి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం వరి సాగు ఆరోగ్యకరంగా ఉందన్నారు. వరి పంటకు ఆకుముడత, ఆకునల్లి తెగుళ్లు ఆశించకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

ఏలేశ్వరం: ప్రయాణికుల సలహాలు, సూచనలు స్వీకరించేందుకు శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్టు స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ జీవీ సత్యనారాయణ గురువారం తెలిపారు. స్థానిక ఆర్టీసీ డిపోలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ డయల్ యువర్ డీఎం నిర్వహిస్తామన్నారు. ప్రయాణికులు 99592 25532 నంబర్‌కు కాల్ చేసి తమ సమస్యలతో పాటు సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు.

జి.కొత్తపల్లిలో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్



జి.కొత్తపల్లి జేసీబీతో వ్యర్థాల తొలగింపు

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని సర్పంచ్ ఈగల విజయదుర్గ అన్నారు. మండలంలోని జి.కొత్తపల్లిలో గురువారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడిక తీసి గ్రామం నలుమూలలా బ్లీచింగ్ చల్లారు. వీధుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సర్పంచ్ విజయదుర్గ కోరారు.

గ్రామాల్లో శ్రావణ సందడి

- నేడు వరలక్ష్మీదేవి వ్రతం
- కిటకిటలాడిన మార్కెట్లు
- భారీగా పెరిగిన పూజా సామగ్రి ధరలు



ఏలేశ్వరం హనుమాన్ జంక్షన్‌లో పండ్లు, పత్రి కొనుగోలు చేస్తున్న మహిళలు

ఏలేశ్వరం: మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకొనే శ్రావణ శుక్రవారం రానే వచ్చింది. రెండో శుక్రవారాన్ని పురస్కరించుకుని వరలక్ష్మీ వ్రతాలను ఆచరించేందుకు మహిళలు సిద్ధమయ్యారు. లక్ష్మీదేవి అమ్మవారిని వివిధ రూపాల్లో పూజించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. వరలక్ష్మీ వ్రతాల నేపథ్యంలో గురువారం తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లోని గ్రామాల్లో సందడి వాతావరణం కనిపించింది.

ఆలయాలకు శోభ

శ్రావణ శుక్రవారం సందర్భంగా గ్రామాల్లోని ఆలయాలను సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. ఏలేశ్వరం పల్లపువీధిలోని కన్యకాపరమేశ్వరి ఆలయం, తోటవీధి, ఆర్టీసీ డిపో, మార్కెట్ వీధి, దిబ్బలపాలెం, నర్సీపట్నం రోడ్డులోని దుర్గాదేవి ఆలయాలను ముస్తాబు చేశారు. ఆలయాల్లో మహిళలు లలితా సహస్రపారాయణ, విష్ణు సహస్ర, గోవింద నామాలు పఠించనున్నారు.

ధరలకు రెక్కలు

వరలక్ష్మీదేవి వత్రాన్ని పురస్కరించుకుని పూజాసామగ్రి, పండ్లు, పూల ధరలకు రెక్కలు వచ్చాయి. మార్కెట్లలో పత్రిలు, పండ్లు, వస్త్ర, బంగారు దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. ఇక బంగారం ధర అందనంత ఎత్తుకు చేరుకోవడంతో బంగారు రూపులు కొనుగోలుకు చాలా మంది వెనకడుగు వేశారు. రాగి, వెండి రూపులతో సరిపెట్టుకున్నారు. అమ్మవారికి ప్రీతికరమైన చామంతిపూల ధరలు విపరీతంగా పెరిగాయి. నాలుగు పువ్వులు రూ.10కి విక్రయించారు. గురువారం సంతరోజు కావడంతో చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు ఏలేశ్వరం తరలివచ్చారు. జ్యూయలరీ షాపులు మహిళలతో కిటకిటలాడాయి. స్థానిక హనుమాన్ జంక్షన్‌లో అన్నిరకాల పండ్లతో పాటు పత్రిలను ప్రత్యేక దుకాణాలు ఏర్పాటు చేసి విక్రయించారు.

మార్కెట్‌కు శ్రావణ శోభ

తుని: వరలక్ష్మీ వ్రతం సందర్భంగా తుని మార్కెట్‌లో గురువారం సందడి నెలకొంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు బంగారు, వస్త్ర, కిరాణా దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. మెయిన్ రోడ్డులో తోపుడు బండ్లకు పరిమితంగా అనుమతి ఇచ్చారు. కార్లు, భారీ వాహనాలకు అనుమతి ఇవ్వలేదు. కేవలం ద్విచక్రవాహనాలకు మాత్రమే అనుమతి ఇచ్చారు. పండ్లు, పత్రి తదితర దుకాణాలను సూరవరం రోడ్డులో ఏర్పాటు చేశారు. తుని పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన మహిళలు లక్ష్మీదేవి రూపులు కొనుగోలు చేయడంతో బంగారు దుకాణాలు కళకళలాడాయి. ధరలు ఎక్కువైనా ప్రజలు పూజా సామగ్రి కొనుగోలు చేశారు. మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు, పట్టణ సీఐ గీతా రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు, అధికారులు ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకున్నారు.



ఏలేశ్వరంలో పూలు విక్రయిస్తున్న వ్యాపారి

తొండంగి: గ్రామాల్లో వరలక్ష్మీ వ్రతాల సందడి నెలకొంది. మహిళలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు ఆచరించేందుకు అవసరమైన పూజా సామగ్రి కొనుగోలు చేశారు. గురువారం గ్రామాల్లో మార్కెట్లు కిటకిటలాడాయి. ఎ.కొత్తపల్లి, ఒంటిమామిడి, శృంగవృక్షం తదితర గ్రామాల్లోని దుర్గామాత ఆలయాలు, గోపాలపట్నం నేరేళ్లమ్మ అమ్మవారి ఆలయాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

ప్రత్తిపాడు: గ్రామంలోని పండ్లు, బంగారు దుకాణాలు గురువారం కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. వరలక్ష్మీ పూజకు అవసరమయ్యే పండ్లు, కాయలు, పువ్వులు, ఇతర పూజా సామగ్రి దుకాణాలతో పాటు బంగారు దుకాణాల్లో రద్దీ నెలకొంది. బంగారం ధర గత నెల రోజుల వ్యవధిలో విపరీతంగా పెరిగిపోవడంతో ప్రజలు తమ స్తోమతకు తగ్గట్టుగా రూపులు కొనుగోలు చేశారు. పూజకు కనీసం ఐదు రకాలకు తక్కువ కాకుండా పండ్లను కొనుగోలు చేశారు.

పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్
- ఏలేశ్వరంలో గడపగడపకూ మన ప్రభుత్వం



ఏలేశ్వరంలో ప్రజలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

ఏలేశ్వరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే పర్వత పూర్ణ చంద్రప్రసాద్ అన్నారు. పట్టణంలోని 8వ వార్డు పరిధిలోని అప్పన్నపాలెం, 9వ వార్డులో గురువారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాలుగేళ్లలో 99 శాతం ఎన్నికల హామీలను అమలు చేశారన్నారు. రాష్ట్రంలో అన్నివర్గాలకూ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శిడగం వెంకటేశ్వరరావు, అలమండ చలమయ్య, దేగల వెంకటరమణ, సామంతుల సూర్యకుమార్, వాగు బలరామ్, జువ్విన వీర్రాజు, పైల విజయ్‌కుమార్, పైల శ్రీధర్, చిక్కాల లక్ష్మణరావు, అడపా పార్థసారథి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సిబ్బందికి మెమోలు



ప్రత్తిపాడు అంగన్‌వాడీ వర్కర్, హెల్పర్లకు మెమోలిస్తున్న సీడీపీఓ లక్ష్మి

ప్రత్తిపాడు: స్థానిక అంగన్‌వాడీ కేంద్రం-4 సిబ్బందికి గురువారం ఐసీడీఎస్ సీడీపీఓ ఆర్‌వీఎస్ లక్ష్మి మెమోలు ఇచ్చారు. మూడు రోజులుగా అంగన్‌వాడీ కేంద్రాన్ని తెరవడం లేదు. దీనిపై ఫుడ్ కమిషన్ సభ్యుడు జక్కంపూడి కిరణ్‌కు ఫిర్యాదు అందింది. ఆయన ఆదేశాల మేరకు స్థానిక సీడీపీఓ ఆర్‌వీఎస్ లక్ష్మి విచారణ చేపట్టారు. కేంద్రం తెరవకపోవడం వాస్తవమని విచారణలో వెల్లడికావడంతో అంగన్‌వాడీ వర్కర్ విజయలక్ష్మి, హెల్పర్ అచ్చిరాజులకు సీడీపీఓ మెమోలిచ్చారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

సామర్లకోట: ఉపాధి హామీ పథకంలో పనులు మరింత నాణ్యతతో జరగడానికి ఇస్తున్న శిక్షణను డ్వామా అధికారులు సద్వినియోగం చేసుకోవాలని ఈటీసీ వైస్ ప్రిన్సిపాల్ ఇ.కృష్ణమోహన్ అన్నారు. స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, తూర్పుగోదావరి, పశ్చిమ, ఏలూరు, కాకినాడ, కోనసీమ, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం జిల్లాలో పని చేస్తున్న డ్వామా పీఓలకు మూడు రోజుల పాటు నిర్వహించే శిక్షణను గురువారం ఆయన ప్రారంభించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి గ్రామంలోను మొక్కలు నాటడంపై దృష్టి సారించాలన్నారు. ఈ మొక్కలలో 60 శాతం మునగ మొక్కలు ఉండేలా చూడాలన్నారు. ఈటీసీ ప్యాకల్టీలు పి.శ్రీనివాసరావు, ఎంఎస్ఎన్ రెడ్డి, బి.ఆంజనేయులు, వెంకటేశ్వరరావు, వి.ప్రసాద్, నిహారిక, ఎస్‌కె మొహిద్దీన్‌లు మొదటి రోజు శిక్షణ నిర్వహించారు.

చంద్రయాన్–3 విజయవంతంపై సంబరాలు



ఏలేశ్వరంలో జాతీయ జెండాలతో సంబరాలు చేసుకుంటున్న విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు



శంఖవరంలో మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు

ఏలేశ్వరం: చంద్రయాన్–3 ప్రయోగం విజయవంతం కావడంతో పట్టణంలో గురువారం సంబరాలు చేశారు. విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో జాతీయ జెండాలు, బెలూన్లు చేతపట్టుకుని పట్టణంలోని పలు వీధుల మీదుగా ఊరేగింపు నిర్వహించారు. స్థానిక బాలాజీచౌక్ వద్ద సంబరాలు చేసి శాస్త్రవేత్తలకు సంఘీభావంగా నినాదాలు చేశారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకులు కటకం కిరిటీ, పాబోలు దేవి, ప్రత్తిపాడు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్ పుల్లయ్య, స్వామి దయానందా సరస్వతి పాల్గొన్నారు.

విద్యార్థుల మానవహారం

శంఖవరం: చంద్రయాన్–3 ప్రయోగం విజయవంతంతో శంఖవరంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు గురువారం సంబరాలు జరిపారు. స్థానిక ఆదర్శ పాఠశాల ఆవరణలో విద్యార్థులు కంగ్రాట్స్ ఇస్రో ఆకారంలో మానవహారంగా ఏర్పడ్డారు. పాఠశాల నుంచి ర్యాలీ చేశారు.

వైభవంగా పరదేశమ్మతల్లి తీర్థం



ప్రత్యేక అలంకరణలో పరదేశమ్మతల్లి



అమ్మవారికి దర్శనాలకు క్యూ కట్టిన భక్తులు

తుని రూరల్: ఎస్.అన్నవరం పంచాయతీ కొత్త సూరవరంలో కొలువైన పరదేశమ్మతల్లి తీర్థ మహోత్సవం గురువారం వైభవంగా జరిగింది. తెల్లవారుజాము నుంచే అమ్మవారి దర్శనాలకు భక్తులు పోటెత్తారు. ఎస్.అన్నవరం, తుని, కవలపాడు, అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం రామభద్రపురం, పాల్తేరు, ఈదట తదితర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. జాతరోత్సవాల ముగింపు సందర్భంగా పరదేశమ్మ బాలభక్త వినాయక సంఘం ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. జేడీ డ్యాన్స్ బేబీ డాన్స్, కూచిపూడి, భరత నాట్యం, చిన్నపిల్లల గాజులు, బొమ్మల ప్రదర్శన భక్తులను అలరించాయి. సంఘం అధ్యక్షుడు వేముల శివన్నారాయణ, కార్యదర్శి పైల వెంకటరమణ, కోశాధికారి సన్యాసిరావు పాల్గొన్నారు.

కోవిడ్ వ్యాక్సిన్ ట్రయల్స్‌లో ప్రత్తిపాడు వాసి

- సత్కరించిన తెలంగాణ సీఎం కేసీఆర్



వెంకటేష్‌ను సత్కరిస్తున్న తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్

ప్రత్తిపాడు: కోవిడ్ వ్యాక్సిన్ ట్రయల్స్ పాల్గొన్న ప్రత్తిపాడు గ్రామానికి చెందిన ముక్కు వెంకటేష్‌ను ఇటీవల తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ సత్కరించారు. ప్రత్తిపాడు గ్రామానికి చెందిన విశ్రాంత ఎంఈఓ ముక్కు సుబ్రహ్మణ్యం కుమారుడు వెంకటేష్ నాగ్‌పూర్‌లో జియో కంపెనీలో మేనేజర్‌గా పని చేస్తున్నాడు. కోవిడ్ సమయంలో వ్యాక్సిన్ కనిపెట్టడానికి భారత్ బయోటెక్ ఆధ్వర్యంలో గిల్లూర్కర్ ఆసుపత్రిలో డాక్టర్ చంద్రశేఖర్ నిర్వహించిన క్లినికల్ ట్రయల్స్‌లో నాగ్‌పూర్‌కు చెందిన 50 మంది యువకులు పాల్గొన్నారు. వారిలో ముక్కు వెంకటేష్ ఒకరు. కోవిడ్ వ్యాక్సిన్ విజయవంతమైన సంగతి తెలిసిందే. కాగా ఇటీవల నాగపూర్ వచ్చిన సీఎం కేసీఆర్‌ను ఉభయ తెలుగు రాష్ట్రాల యువకులు కలిశారు. వారి ద్వారా క్లినికల్ ట్రయల్స్‌లో పాల్గొన్న ముక్కు వెంకటేష్ ధైర్యాన్ని సీఎం కేసీఆర్ ప్రశంసించి, శాలువాతో సత్కరించారు.

నాడు బురదమయం.. నేడు అభయం

ప్రత్తిపాడు రూరల్: గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పల్లెల్లో రోడ్లు పూర్తిగా ఛిద్రమై అధ్వానంగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పల్లెల్లో రహదారుల రూపురేఖలు పూర్తిగా మారిపోతున్నాయి. ప్రభుత్వ నిధులతో గ్రామాల్లో పలు చోట్లు సిమెంట్ రోడ్లు నిర్మిస్తున్నారు. మండలంలోని ధర్మవరంలో గతంలో రహదారులు గోతులతో ప్రమాదకరంగా ఉండడంతో ఆయా మార్గాల్లో నడిచి వెళ్లేందుకు సైతం ప్రజలు అవస్థలు పడేవారు. ప్రజల కష్టాలను గుర్తించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గ్రామంలో పలు ప్రాంతాల్లో రహదారుల నిర్మాణం చేపట్టింది. ఎస్సీపేటలో రూ.15 లక్షలతో రాపాక గుర్రాజు ఇంటి వద్ద నుంచి జువ్వల తాసు ఇంటి వరకూ 320 మీటర్ల పొడవైన రోడ్డు నిర్మించారు. రామారావుపేటలో రూ.10 లక్షలతో జువ్వల వెంకటేశ్వరరావు ఇంటి నంచి ముద్దా చక్రం ఇంటి వరకూ 190 మీటర్ల మేర, సీతంపేటలో రూ.20 లక్షలతో కోనేటి రాజబాబు ఇంటి నుంచి ఇసరపు గోపన్న ఇంటి వరకూ 270 మీటర్ల మేర రోడ్లను అభివృద్ధి చేశారు. దీంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



నాడు: ధర్మవరం ఎస్సీపేటలో బురదమయంగా ఉన్న రోడ్డు



నేడు: ఎస్సీ కాలనీలో రూ.15 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు



నాడు : రామారావుపేటలో అధ్వానంగా ఉన్న రోడ్డు



నేడు : రామారావుపేటలో రూ.10 లక్షలతో నిర్మించిన రోడ్డు

పక్షవాతం, కాలేయ వ్యాధులపై అవగాహన



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న న్యూరో వైద్య నిపుణులు డాక్టర్ బలభద్ర వెంకటరాజు

జగ్గంపేట: స్థానిక షాదీఖానాలో గురువారం జగ్గంపేట, గండేపల్లి పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైద్య విజ్ఞాన సదస్సు నిర్వహించారు. పక్షవాతం, జీర్ణాశయం, కాలేయ సంబంధిత వ్యాధులపై రాజమహేంద్రవరానికి చెందిన న్యూరో మల్టీ స్పెషాలటీ హాస్పిటల్ అధినేత, న్యూరో వైద్య నిపుణులు డాక్టర్ బలభద్ర వెంకటరాజు ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలు ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ వైద్యులు బలభద్ర రఘువీర్, కార్డియాలజిస్ట్ నీలం వినోద్ కుమార్, జిల్లా కో కన్వీనర్ బళ్లా శ్రీనివాసరావు, జగతా బాబ్జీ, కునుకు పెద్దిరాజు, రాఘవ, మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతి పొందిన ఎస్సైకు సత్కారం



విద్యాసాగర్ దంపతులను గజమాలతో సత్కరిస్తున్న సీఐ, తదితరులు

గండేపల్లి: జగ్గంపేట ఎస్సైగా విధి నిర్వహణలో సీహెచ్ విద్యాసాగర్ చేసిన సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. ఎస్సై విద్యాసాగర్‌కు సీఐగా పదోన్నతి లభించడంతో జగ్గంపేటలో బుధవారం రాత్రి సీఐ బి.సూర్యఅప్పారావు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఉద్యోగులకు విధి నిర్వహణలో చేసిన సేవలే గుర్తింపు ఇస్తాయన్నారు. సీఐగా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని సూచించారు. అనంతరం విద్యాసాగర్ దంపతులను గజమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఒమ్మి రఘురాం, జేసీఎస్ మండల కన్వీనర్, గ్రామ ఉప సర్పంచ్ బండారు రాజా గండేపల్లి ఎస్సై వై.గణేష్ కుమార్, ఏఎస్సై నూకరాజు సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల పరిశీలన



కిర్లంపూడిలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ బాలామణి

కిర్లంపూడి: మండలంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను డీఎల్‌పీఓ బాలామణి గురువారం పరిశీలించారు. డీఎల్‌పీఓ బాలామణి, ఈఓపీఆర్డీ వీర్రాజు, డీపీఆర్‌సీ నుంచి మరో ఇద్దరు టీమ్‌లుగా ఏర్పడి మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పరిశీలించారు. కేంద్రాల నిర్వహణపై స్థానిక అధికారులను ఆరా తీశారు. ఈ సందర్భంగా బాలామణి మాట్లాడుతూ గ్రామాల్లో సంపద కేంద్రాలను సమర్థంగా నిర్వహించాలన్నారు. ఎరువులను తయారు చేసి తక్కువ ధరకే రైతులకు విక్రయించాలని సూచించారు.

తేలు కుట్టి విద్యార్థి మృతి

కాకినాడ క్రైం: ఉన్నత చదువులు చదివి జీవితం బంగారుమయం చేసుకోవలసిన ఓ విద్యార్థి తేలు కుట్టడంతో ప్రాణాలు కోల్పోయాడు. కపిలేశ్వరపురం మండలం కోరుమిల్లి గ్రామానికి చెందిన యాళ్ల అభిలాష్ (14) వాకతిప్ప జెడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. ఎప్పటిలాగే, గురువారం ఉదయం పాఠశాలకు వచ్చాడు. ఉదయం 10 గంటల సమయంలో తరగతి గదిలో చివర ఉన్న విరిగిపోయిన బెంచీల మూలల్లో వ్యర్థాలను శుభ్రం చేసేందుకు తన స్నేహితుడితో కలిసి వెళ్లాడు. అలా శుభ్రం చేస్తుండగా ఓ తేలు అభిలాష్ చేతిపై కుట్టింది. అది గమనించిన మరో విద్యార్థి తేలుని కొట్టి చంపాడు. ఆ తక్షణమే తరగతి ఉపాధ్యాయుడు మరో ఉపాధ్యాయుడు రాజ్‌కుమార్‌కు చెప్పి అభిలాష్‌ను స్థానిక పీహెచ్‌సీకి పంపారు. అక్కడి వైద్యుడు మందులు ఇచ్చారు. కాసేపటికి విద్యార్థికి వాంతులయ్యాయి. మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు సిఫార్సు చేయగా అభిలాష్‌ను రాజ్‌కుమార్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే నాడి కొట్టుకోవడంలో ప్రతికూల మార్పు లు వచ్చాయని వైద్యులు గుర్తించారు. వైద్యం మొదలైన కొద్ది సేపటికి మూడు రక్తపు వాంతులయ్యాయి. అత్యవసర స్థితి ఎదురుకావడంతో ఐసీయూలో ఉంచి వైద్య సేవలు అందించారు. విద్యార్థి పరిస్థితి తెలుసుకున్న ఎంఎల్‌సీ తోట త్రిమూర్తులు విద్యార్థి ఆరోగ్యంపై ఆందోళన వ్యక్తం చేస్తూ జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతాదేవిని ఫోన్‌లో సంప్రదించి మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. అభిలాష్‌కు వైద్యం కొనసాగుతుండగా అప్పటికే తేలు విషం శరీరం మొత్తానికి అంచెలంచెలుగా వ్యాపించి కీలక అవయవాల పనితీరుని పూర్తిగా దెబ్బతీసింది. సమయం గడుస్తున్న కొద్ది అవయవాలన్నీ ఒకొక్కటిగా క్షీణించడం మొదలు పెట్టాయి. ఈ స్థితిలో మృత్యువుతో పోరాడిన అభిలాష్ గురువారం రాత్రి ప్రాణాలు కోల్పోయాడు. అభిలాష్ తండ్రి ప్రసాద్ ఓ దినసరి కూలి. ఈయనకు ఇద్దరు కుమారులు ఉండగా అభిలాష్ చిన్నవాడు. కుమారుడి మరణంతో తల్లిదండ్రులు జీజీహెచ్ ఆవరణలో గుండెలవిసేలా రోదించారు. పదుల సంఖ్యలో విద్యార్థులు, ఉపాధ్యాయులు కాకినాడ జీజీహెచ్‌కు చేరుకున్నారు.